సింగరేణి జాయింట్ వెంచర్‌ను ఒప్పుకోం

తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించేందుకు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని, ఈ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం చేసింది. జాయింట్ వెంచర్ అంటే ప్రైవేటీకరణను ప్రోత్సహించడమేనని జేఏసీ నేతలు ఆరోపించారు. జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధలో జేఏసీ నేతలు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. మూడేండ్లుగా జెన్‌కో లాభాల్లో నడుస్తున్నదని, 2020-21లో రూ. 168 కోట్లు, 2021-22లో రూ.394.46 కోట్లు, 2022-23లో రూ.472.94 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. జెన్‌కో ఈక్విటీతోనే రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వజీర్, మాజీద్, రమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్పత్తి లక్ష్యం పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి లక్ష్యాన్ని క్రమంగా పెంచుకుంటున్నది. ఇది వరకు రోజుకు రెండు లక్షల బొగ్గును ఉత్పత్తి, రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. తాజాగా దీనిని 2.1 లక్షల టన్నులకు పెంచుకున్నది. బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కంపెనీ సీఎండీ ఎన్ బలరాం ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని అన్ని ప్రాంతాల జీఎంలకు ఆయన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలతో కొద్ది రోజుల పాటు సింగరేణిలో ఉత్పత్తి నిలిచిపోగా, వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా ఈ లక్ష్యాన్ని నిర్దేశించారు.

నల్లబ్యాడ్జీలతో కేటీపీపీ ఉద్యోగుల నిరసన

థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించబోమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీలో శనివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. - గణపురం

చేనేత రుణమాఫీ ఏమాయే..!

- ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- తీవ్ర ఆవేదనలో చేనేత కార్మికులు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 10 వేల మంది కార్మికులు ఈ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 'చేనేత పాలసీ' అనేది ఏదీ లేదని చేనేత కార్మికులు మండిపడుతున్నారు. చేనేతలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని చేనేత కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, చెరుకు స్వామి విమర్శిస్తున్నారు. మరికొన్ని డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

- చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి.
- చేనేతల కోసం రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలనే డిమాండ్‌ను నెరవేర్చాలి
- త్రిఫ్ట్ ఫండ్, యూరన్ సబ్సిడీ, నేతన్నకు బీమా పథకాలు అమలు చేయాలి
- బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- వస్త్రనిల్వలు వెంటనే కొనుగోలు చేయాలి
- వర్కర్ టూ ఓనర్, జనతా వస్త్ర పథకాలను అమలు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- యూరన్ సబ్సిడీ నిధులను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- ప్రతి నేతన్నకు పెట్టుబడిసాయం కింద రూ.5 లక్షలు అందించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలో ఉత్పత్తి చేయించాలి.

టీ కొట్టు శివకు ఐదు కొలువులు

- పోటీ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా ధర్మారం యువకుడి సత్తా
- గత మార్చిలో గురుకుల జేఎల్, పీజీటీ, టీజీటీల్లో ప్రతిభ
- తాజాగా జేఎల్, డీఎస్సీలో విజయ ఢంకా

మహేశ్ కుమార్

ధర్మారం, అక్టోబర్ 5: ఓ పేదింటి బిడ్డ.. ప్రభుత్వ కొలువులు కొల్లగొట్టాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొన్నాళ్లు టీకొట్టు నడిపిన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఉడాన్ శివ మహేశ్ కుమార్.. ఆరు నెలల్లోనే ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. ధర్మారానికి చెందిన ఉడాన్ సుశీల-లక్ష్మణ్ దంపతులకు శివ మహేశ్ రెండో కొడుకు. ధర్మారంలో చదువుకుంటూనే తల్లిదండ్రులకు సాయపడేవాడు. 2014లో సునీతను వివాహం చేసుకున్నాడు. 2020లో పీజీ పూర్తిచేశాడు. కరోనా టైంలో రాజారాంపల్లిలో టీకొట్టు నడిపాడు. తర్వాత దానిని వదిలేసి తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో 2022లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో గురుకులాల లెక్చరర్, టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. అదే ఏడాది ఆగస్టులో పరీక్షలు రాశాడు. గత మార్చిలో ఫలితాలు రాగా.. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ కొలువులకు ఎంపికయ్యాడు. జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంపిక చేసుకొని ప్రస్తుతం నిర్మల్ జిల్లా మామడలోని గురుకులంలో పనిచేస్తున్నాడు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ పరీక్ష, ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు రాసి ప్రతిభ చాటాడు. ఇటీవలే విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ విజయం తన తల్లిదండ్రులకే అంకితమని శివమహేశ్ తెలిపారు.

నిలిచిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పలు జిల్లాల్లో డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిచిపోయింది. కొన్ని జిల్లాల్లో ఇంకా 1:3 జాబితాలు విడుదల కాలేదు. కోర్టుకేసుల కారణంగా నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. శనివారం వరకు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా, స్పెషల్ ఎడ్యుకేషన్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కోర్టుకేసులు లేని జిల్లాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు.

- నల్లగొండలో ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కానీ ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితాలో 31కి 29 మంది హాజరయ్యారు.

హరీశ్ (ఫైల్) సురేశ్ (ఫైల్) హేమలత (ఫైల్)

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

- రూ.30 లక్షలకుపైగా కుమారుడి అప్పులు
- 20 గుంటల భూమి అమ్మి అప్పుల చెల్లింపు
- మనస్తాపంతో కుమారుడితోపాటు తల్లిదండ్రుల ఆత్మహత్య
- నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లిలో విషాదం

ఎడపల్లి, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో కుటుంబం బలైంది. రూ.లక్షలు పోగొట్టిన ఓ యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగణవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతులకు ఇద్దరు సంతానం. మెదడువాపు వ్యాధితో కూతురు చిన్నప్పుడే మృతి చెందింది. ఏకైక కుమారుడు హరీశ్ (22) నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆరెన్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణాషాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుందామన్న ఆశతో గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి భారీగా అప్పులు చేశాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటి నిర్మాణాన్ని ఆపేశారు. హరీశ్ చేసిన రూ.30 లక్షలకుపైగా అప్పులను తమకున్న 20 గుంటల భూమిని అమ్మేసి తీర్చారు. అయినప్పటికీ కుమారుడిలో మార్పు రాలేదు. నలుగురిలో తిరగలేక మనస్తాపం చెందిన తల్లిదండ్రులు, కుమారుడు శుక్రవారం రాత్రి ఉరేసుకున్నారు. తెల్లారినా ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాండాలో జనగామవాసి హత్య

సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో ప్రాణాలొదిలిన తిరుమలేశ్

తిరుమలేశ్ (ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : ఉగాండా దేశంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జనగామ వాసి ఇటికాల తిరుమలేశ్ (41) శుక్రవారం అక్కడ హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ ఇటికాల కిష్టయ్య-కిష్టమ్మ దంపతుల పెద్ద కుమారుడు తిరుమలేశ్ నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 2014 నుంచి ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ కంపెనీకి ఉగాండాలోని నమ్మసాలలో బ్రాంచ్ కార్యాలయం ఉండటంతో 15 నెలల నుంచి భార్య, కుమారుడితో కలిసి తిరుమలేశ్ అక్కడే ఉంటున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు (ఉగాండా కాలమానం ప్రకారం) డ్యూటీకి వెళ్లాడు. అక్కడ కొత్తగా విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డు ఓపియో మద్యం మత్తులో గాల్లోకి కాల్పులు జరుపుతుండగా సహోద్యోగులతో కలిసి తిరుమలేశ్ బయటకు వచ్చాడు. సెక్యూరిటీగార్డు విచక్షణ కోల్పోయి తిరుమలేశ్‌పైకి కాల్పులు జరపగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తిరుమలేశ్ భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో వారిని పరామర్శించారు.

జపాన్ టూర్‌కు నవోదయ విద్యార్థి

చొప్పదండి, అక్టోబర్ 5 : చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో 12వ తరగతి చదువుతున్న రిత్విక్‌రెడ్డి జపాన్ టూర్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. దేశవ్యాప్తంగా 660 నవోదయ విద్యాలయాలు ఉండగా అందులో 20 మంది విద్యార్థులను పూర్తిగా మెరిటోరియస్ బేస్‌పై ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జపాన్ టూర్‌కు ఎంపికైన రిత్విక్‌రెడ్డిని ఆమె అభినందించారు.

12 వరకు పటాకుల దుకాణాల దరఖాస్తుల గడువు

రాంనగర్, అక్టోబర్ 5 : దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక పటాకుల విక్రయ కేంద్రాల ఏర్పాటు కోసం వ్యాపారులు ఈ నెల 12వ తేదీలోగా పోలీస్ కమిషనరేట్ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిస్థాయిలో నిబంధనలు, రక్షణ చర్యలు చేపట్టిన వారికే అనుమతులు ఇస్తామని చెప్పారు. పటాకులు విక్రయించే వ్యాపారులు వివిధ ప్రభుత్వ శాఖల నిరభ్యంతర పత్రాలు పొందిన తర్వాతే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు ఫారంతోపాటు ఆధార్ కార్డు, వారి పదో తరగతి మెమో, రూ.600 చలాన్‌ను జతచేస్తూ, ఐదు సెట్స్ జిరాక్స్ కాపీలను పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఢిల్లీ పర్యటనలో మల్లాపూర్ విద్యార్థులు

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 5 : మండలంలోని మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9 మంది విద్యార్థులు పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్ నేతృత్వంలో ఢిల్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు షరీఫ్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకంలోని 'చుట్టి పత్ర్' అనే పాఠాన్ని చదివించి, అందులో చెప్పిన చారిత్రక ప్రదేశాల ప్రాముఖ్యతను విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఈ పర్యటన నిర్వహించామన్నారు. ఈ పర్యటనలో విద్యార్థులు రెడ్ పోర్ట్, లోటస్ టెంపుల్, కుతుబ్‌మినార్, ఇండియా గేట్, పార్లమెంట్ భవన్, రాష్ట్రపతి భవన్, అక్షరధామం టెంపుల్ సందర్శించినట్లు తెలిపారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు రెఫరీలుగా జిల్లావాసులు

కొత్తపల్లి, అక్టోబర్ 5 : జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రెఫరీలుగా జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. ఈ నెల 3 నుంచి 7 వరకు హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన నమిలికొండ ప్రభాకర్, మూల వెంకటేశ్ రెఫరీలుగా వ్యవహరిస్తారని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. వీరి ఎంపికపై ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్, డీవైఎస్ఓ వీ శ్రీనివాస్‌గౌడ్, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఉప కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 5 : వెనుకబడిన కులాలకు మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని బేడ బుడగ జంగం, జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి రాగానే వెనుకబడిన కులాలకు మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే తాము కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతామని అన్నారు. సమావేశంలో తుర్పాటి లింగయ్య, వాన రాశి జాన్, చింతలంజి, కడమంచి స్వామి, తూర్పాటి శంకర్, తూర్పాటి రామచంద్రం, గంధం మధు, భూతం అంజన్న పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై కొరడా

- మానేరు ఇసుకాసురులపై పోలీసుల ఉక్కుపాదం
- వేలంలో దక్కించుకున్న డంపు పేరిట భారీ దోపిడీకి స్కెచ్
- గత నెలలోనే గుర్తించిన అధికారులు
- నాలుగు లారీలు, ఎక్స్‌కవేటర్ సీజ్
- గతంలో ఏడుగురి అరెస్టు.. ఇప్పుడు 53 మంది రిమాండ్

జమ్మికుంట పోలీసులకు పట్టుబడ్డ ఇసుక లారీలు

వేలంలో దక్కించుకున్న డంపు పేరిట భారీ దోపిడీకి స్కెచ్ వేసిన ఇసుక మాఫియాపై జమ్మికుంట పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇసుక అక్రమ రవాణాలో ప్రమేయమున్న 61 మందిపై కేసులు నమోదు చేశారు. గతంలో ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు, శనివారం సాయంత్రం పట్టణ సీఐ వీ రవి ఆధ్వర్యంలో 53 మంది అక్రమార్కులను రిమాండ్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణాలో ఏకకాలంలో 61 మందిపై కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించడం జిల్లాలో కలకలం రేపుతున్నది.

జమ్మికుంట, అక్టోబర్ 5: జమ్మికుంట మండలంలోని విలాసాగర్, తనుగుల, గండ్రపల్లి గ్రామాలకు చెందిన వందలాది మంది మానేరు ఇసుకను తోడుకుని సొమ్ము చేసుకునే సంస్కృతి గత కొన్నేళ్లుగా సాగుతున్నది. అడపా దడపా రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టుకోవడం, కేసులు పెట్టడం, నాయకుల ఒత్తిడితో వదిలిపెట్టడం, అప్పుడప్పుడు 'మామూలు'గా తీసుకోవడం జరుగుతున్నది. అయితే ఇటీవల అక్రమార్కులు మరో అడుగు ముందుకేశారు. శంభునిపల్లి పరిధిలోని పరిమళకాలనీ మానేరు ఒడ్డున ఉంది. దీన్ని ఆసరాగా చేసుకున్న ఇసుకాసురులు మానేరు నుంచి ఇసుకను తోడి, ఒడ్డుకు పోసుకున్నారు. అక్కడి నుంచి లారీల ద్వారా సుదూర ప్రాంతాలకు తరలించడం పరిపాటిగా మారింది. ఈ అక్రమానికి గండ్రపల్లి, తనుగుల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అసాంఘిక 'లీడర్'లుగా మారారు. ఇదే క్రమంలో పరిమళకాలనీలో ఇసుక డంపుల నిల్వలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు దాడులు చేశారు. డంపులను సీజ్ చేశారు. డంపులో కొందరు సిబ్బంది ప్రమేయంతో ఇసుక మాయమైందని ప్రచారం కూడా ఉంది. ఇదిలా ఉండగా, రెండు నెలల క్రితం మండల తహసీల్దార్‌గా రమేశ్‌బాబు వచ్చాడు. గత నెల 2న ఇసుక డంపు వేలం ప్రకటన జారీ చేశారు. అక్కడున్న ఇసుక డంపునకు రూ.27లక్షలుగా లెక్కగట్టి, కాంట్రాక్టర్లను టెండర్‌కు పిలిచారు. డంపును బూచిగా చూపి కోట్లు కొల్లగొడుదామనే స్కెచ్ వేసిన అక్రమార్కులు, రంగంలోదిగారు. వేలం పాట పాడారు. రూ.53 లక్షలకు కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. అంటే ఏకంగా డబుల్ రేటు పాడి డంపును దక్కించుకున్నారు. వేలం డబ్బులను పది రోజుల్లోనే రెవెన్యూకు చెల్లించారు. డంపును నెల రోజుల్లో ఖాళీ చేయాలని తహసీల్దార్ ఆదేశాలిచ్చారు. ఇక అక్కడి నుంచి అసలు దందా మొదలైంది.

ఆగడాలు అంతా ఇంతా కాదు

ఇసుక డంపును ఎక్స్‌కవేటర్ సాయంతో లారీల్లో లోడ్ చేయడం, దూర ప్రాంతాలకు తరలించడం ప్రారంభించారు. ఇదే సమయంలో విలాసాగర్, తనుగుల, గండ్రపల్లి గ్రామాలకు చెందిన ఇసుక అక్రమ రవాణాదారులతో ఒప్పందం చేసుకున్నారు. ట్రిప్పుకు రూ.1500 చొప్పున మానేరు నుంచి ఇసుకను ట్రాక్టర్లతో తెచ్చి, డంపుపై పోసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అలా రోజుకు వందల ట్రిప్పులు పాత డంపుపై పోయడం, వేలం పాట ద్వారా కొనుగోలు చేసిన ఇసుక పేరిట అక్రమంగా లారీల్లో దూర ప్రాంతాలకు అమ్ముకొని సొమ్ము చేసుకోవడాన్ని అధికారులు గుర్తించారు. స్థానిక అధికారులతో సంబంధం లేకుండా జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు గత నెల 26న నాలుగు లారీలు, ఎక్స్‌కవేటర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేయించారు. దీంతో అక్రమార్కుల బండారమంతా బయటపడింది. అక్రమాలకు నాయకత్వం లీడర్లను విచారించగా, 59మంది పేర్లు వెలుగులోకి వచ్చాయి. సదరు వ్యక్తులందరూ విలాసాగర్ గ్రామానికి చెందిన వారే కావడం గమనార్హం. దశల వారీగా కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. అక్రమాలకు ఆజ్యం పోసిన మాధవరావును అదుపులోకి తీసుకున్నారు. తొలుత ఏడుగురిని రిమాండ్‌కు పంపించారు. తర్వాత శనివారం 53మందిని కోర్టుకు తరలించారు. తనుగులకు చెందిన శ్రీను పరారీలో ఉన్నాడు. అయితే ఇసుక అక్రమ రవాణాలో పట్టణానికి చెందిన ఓ సంఘానికి చెందిన వ్యక్తి ప్రమేయమున్నట్లు ప్రచారం జరుగుతోంది. తనకు సన్నిహితంగా ఉండే వ్యక్తులను తప్పించేందుకు విశ్వప్రయత్నాలు చేశాడని, పోలీసులు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కేసులు నమోదు కావడంతో సదరు వ్యక్తి ఆటలు సాగలేదని తెలిసింది. ఇదిలా ఉండగా పరారీలో ఉన్న వ్యక్తిని నేడో.. రేపో అరెస్టు చేసే అవకాశం ఉంది. సదరు వ్యక్తి అరెస్టుతో మరి కొందరి పేర్లు బయట పడే అవకాశం ఉంది. బ్యాక్‌బోన్‌లా వ్యవహరించిన వ్యక్తితో పాటు మరో 20 మందిపై కేసులు నమోదవుతాయనే చర్చ సాగుతోంది.

దేవాదాయ శాఖలో పదోన్నతులు

- పలువురు జూనియర్ అసిస్టెంట్లకు ఈవోలుగా బాధ్యతలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి నలుగురి ఎంపిక

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 5 : దేవాదాయ శాఖలో దాదాపు 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-3 ఈవోలుగా పదోన్నతులు కల్పిస్తూ శనివారం హైదరాబాద్‌లో నియామక ప్రతాలు అందజేశారు. జీవో 134 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 33 మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నలుగురు శనివారం మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఇందులో వెంకటాచారికి నగరంలోని కట్టరాంపూర్ అభయాంజనేయ స్వామి ఆలయం, సుభద్రకు జమ్మికుంటలోని దుబ్బ మల్లన్న ఆలయం, కాచం శ్రీనివాస్‌కు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శివసాయిబాబా ఆలయం, సురేందర్‌కు జగిత్యాల జిల్లా కేంద్రంలోని రామమందిరం కేటాయిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

ఫిర్యాదుపై స్పందించిన లోకాయుక్త రిజిస్ట్రార్

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 5 : పట్టణం, మండలంలోని పలు అక్రమ కట్టడాలపై చేసిన ఫిర్యాదుపై లోకాయుక్త రిజిస్ట్రార్ స్పందించినట్టు యువజన కాంగ్రెస్ నాయకులు టేకుల శ్రావణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం పట్టణంలో మాట్లాడారు. పట్టణ శివారులో అక్రమ కట్టడాలు నిర్మిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకుండా నోటీసుల పేరిట కాలయాపన చేశారని అన్నారు. ఈ విషయమై ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేయగా స్పందన కరువైందని అందుకే న్యాయపోరాటం చేయడానికి సిద్ధమై లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్టు వివరించారు. తన ఫిర్యాదుకు స్పందించిన లోకాయుక్త అధికారులు వచ్చే నెల 8న ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని జిల్లా అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

కరీంనగర్ బాలికల జట్టు క్రీడాకారిణులు

రెజ్లింగ్ పోటీల్లో కరీంనగర్‌కు తృతీయ స్థానం

కొత్తపల్లి, అక్టోబర్ 5 : పాఠశాలల క్రీడా సమాఖ్య రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల రెజ్లింగ్ చాం;రయన్‌షిప్‌లో కరీంనగర్ జిల్లా తృతీయ స్థానం కైవసం చేసుకుంది. నారాయణపేట జిల్లా ధన్వాడలో ఈ నెల 3 నుంచి 5 వరకు జరిగిన ఈ పోటీల్లో కరీంనగర్ క్రీడాకారులు అద్భుతంగా రాణించి పలు పతకాలు సాధించారు. అండర్-14లో టీ కారుణ్య 39 కేజీల విభాగంలో, 57 కేజీల విభాగంలో బీ శ్రీక్ష రజత పతకాలు సాధించారు. అలాగే, 30 కేజీలలో ఈ మధుప్రియ, 36 కేజీలలో ఎం రచన కాంస్య పతకాలు సాధించగా, అండర్-17లో 69 కేజీల విభాగంలో కే శృతి రజతం, 57 కేజీలలో కే కీర్తన, 61 కేజీలలో ఎం అమూల్య, 73 కేజీలలో పీ శ్రీహర్ష, అండర్-19 విభాగంలో 55 కేజీలలో సంజన కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కరీంనగర్ జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మల రమేశ్‌రెడ్డి, క్రీడా సమాఖ్య కార్యదర్శులు వేణు కుమార్, మధు జాన్సన్, టీం కోచ్ పీ శిరీష అభినందించారు.

మానకొండూర్‌కు మళ్లీ ఇన్‌చార్జి సీఐ



బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణ

రాంనగర్, అక్టోబర్ 5: మూడు నెలలుగా ఖాళీగా ఉన్న మానకొండూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్టును ఇన్‌చార్జిలతోనే కాలం వెల్లదీస్తున్నారు. ప్రస్తుతం మరో మారు ఇన్‌చార్జి సీఐగా కనతాల లక్ష్మీనారాయణకు పోస్టింగ్ ఇవ్వడం చర్చనీయాంశమైంది. సదన్‌కుమార్ ఇన్‌చార్జి సీఐగా వచ్చిన తర్వాత సీపీ అభిషేక్ మొహంతి అతనిని పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యే సత్యనారాయణ బహిరంగ విమర్శలు చేయడంతో పాటు తన వర్గం అధికారులను అణగదొక్కుతున్నారంటూ ఏకంగా మీడియా సమావేశమే పెట్టి చర్చకు తెరలేపారు. తర్వాత ప్యానల్ కమిటీ సూచన మేరకు సదన్‌కుమార్ ఇన్‌స్పెక్టర్ వివాదం సద్దుమణిగిందనుకున్న తరుణంలో సీపీ అధికార పార్టీ నేతలను పట్టించుకోవడం లేదంటూ ఎమ్మెల్యే సీఎం, పీసీసీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో సదన్‌కుమార్ సెలవు పెట్టి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇన్‌చార్జిగా కొనసాగుతూ రాగా, తాజాగా జగిత్యాల సీసీఎస్‌లో పనిచేస్తున్న లక్ష్మీనారాయణను మానకొండూర్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా నియమించగా, శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సాక్షి సంతకం కోసం వచ్చి..

శంకరపట్నం, అక్టోబర్ 5 : సాక్షి సంతకం కోసం వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి దవఖానలో చికిత్స పొందుతూ మృచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం ఘన్ముకుల గ్రామానికి చెందిన మిడిదొడ్డి సమ్మయ్య(55) అదే గ్రామానికి చెందిన మిడిదొడ్డి మల్లయ్యకు సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్ పని ఉండగా, సాక్షి సంతకం కోసం హుజూరాబాద్ వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తుండగా మండలంలోని మెట్‌పల్లి-ఆముదాలపల్లి మార్గం మధ్యలో బైక్ అదుపు తప్పడంతో కింద పడ్డారు. దీంతో వెనుక కూర్చున్న సమ్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని జమ్మికుంట దవాఖానకు, అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సమ్మయ్య శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మల్లయ్య అజాగ్రత్తగా వాహనం నడిపి తమ తండ్రి మృతికి కారణమయ్యాడని మృతుడి కూతురు ముత్యాల నవ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.